: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231



విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 7 | 14-11-2022 | పుటలు : 4




## నవంబర్ 14
## నెహ్రూ జయంతి
## బాలల దినోత్సవం

ఏ ప్రపంచపు దుష్టత్వము లేని
ఏ దుర్నీతి దురన్యాయమూ సోకని శాంతియుత నిశ్చింత
లోకం మీదిప్పుడు!

మానవ జీవితపు పొరలలో జ్ఞాపకాల అరలలో
అనుభూతుల తెరలలో
బాల్యానికి మించిన వస్తువేది

సృష్టిలో ప్రతి వస్తువు బాల్యంలో అపురూపమైందే!!
ఆనందాల కడలికి అలుపంటూ ఉండదు
చిరునవ్వుల వెలుగుకి సెలవంటూ ఉండదు
బాల్యంలోజీవనపాఠాలకంటే.... జీవనమాధుర్యాలే ఎక్కువ
అంతులేనిలోకాల ఆనందాల తీరంపైన పిల్లల
సమావేశమిది!!

శుభాకాంక్షలతో....
- నన్నయవాణి

## మంచిమాట



సమష్టి కల్యాణాన్ని
కాంక్షించడంలోనే
వ్యక్తి స్వకీయ క్షేమమూ ఉంది.

In the well - being of
one's own nation is
one's own well - being.

Swami Vivekananda

# నన్నయకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్స్

### వీసీ జగన్నాథరావుకు సర్టిఫికేషన్ అందించిన లీడ్ ఆడిటర్



వీసీకి సర్టిఫికెట్లు అందిస్తున్న లీడ్ ఆడిటర్


**07.11.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ 50001 : 2018 ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎనర్జీ సేవింగ్ ప్రాక్టీసెస్, ఐ.ఎస్.ఓ 14001 : 2015 ఇంప్లిమెంటేషన్ ఆఫ్ గ్రీనరీ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రమోషన్ ఆక్టివిటీస్, జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికెట్స్ ను సాధించామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలియజేశారు. హిమ్ ఇంటర్నెషనల్ సర్టిఫికేషన్ లీడ్ ఆడిటర్ ఆలపాటి శివయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాగణంలో వీసీ జగన్నాథరావుకు సర్టిఫికేషన్ ను అందజేశారు. ఈ సందర్భంగా లీడ్ ఆడిటర్ శివయ్య మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రీన్, ఎన్విరాన్మెంట్, ఎనర్జీ, జెండర్ సెన్సిటైజేషన్ లో భాగంగా ఎంతో ఉన్నతంగా ఉందని అన్నారు. లింగ వివక్షత లేకుండా సమాన హక్కులను పద్ధతులను అనుసరిస్తున్నందువలన జండర్ సెన్సిటైజేషన్ సర్టిఫికెట్ ను అందించామన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న చెరువులతో పాటు ఇంకుడుగుంటలు, చెక్ డ్యామ్స్ ప్రత్యేకతలుగా నిలిచాయన్నారు. అటవీశాఖ వారి సహకారంతో విస్తారంగా మొక్కలను పెంచుతూ విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఎనర్జీ కి సంబంధించి సోలార్ పవర్, ఎల్.ఈ.డీ లైట్స్ ను ఉపయోగిస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వాన్ని ప్రశంసించారు. వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి చిహ్నాలుగా సర్టిఫికేషన్లు నిలుస్తాయన్నారు. సమర్ధవంతంగా ఆడిట్ ప్రక్రియలు నిర్వహించి సర్టిఫికేషన్స్ అందజేసిన హిమ్ ఇంటర్నెషనల్ సర్టిఫికేషన్ లీడ్ ఆడిటర్ ఆలపాటి శివయ్యను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ పీర్ టీం వస్తున్న శుభతరుణంలో విశ్వవిద్యాలయ గుర్తింపును మరింత పెంచే విధంగా ఇటువంటి సర్టిఫికేషన్స్ రావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఐ.క్యూ.ఎ.సి ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్.డా.కె.వి.స్వామి పాల్గొన్నారు.

## నవంబర్ 17 జాతీయ జర్నలిజం దినోత్సవం సందర్భంగా...

"ప్రతి విషయం ప్రజల పక్షం.
ప్రతి విషయం అక్షర సత్యం"
– రాజేష్ మోసిగంటి
జాతీయ జర్నలిజం దినోత్సవ శుభాకాంక్షలు!!
నన్నయ విద్యార్థి మాట....
ప్రతి విషయం విద్యార్థి పక్షం!
ప్రతి విషయం అక్షర సత్యం!!
మా నన్నయవాణి.



## కిలంవల్ల నాణెం విలువతగ్గదు



గోదావరి జిల్లాల విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే నన్నయ విశ్వవిద్యాలయ భావనల్ని మనం గుర్తించగలిగితే అది అందించే విద్యా సేవలు మనకు ఒక కానుకలా అనిపిస్తాయి. 12B,ISO,AICTE గుర్తింపులను పొంది విశ్వవిద్యాలయం ప్రస్తుతం NAAC గ్రేడింగ్ సమకూర్చుకునే పనిలో ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఉపాధి అవకాశాల వైపుకు వెళ్లే నైపుణ్యాలను అందించడానికి నిత్యం కృషి చేస్తుంది.

ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయం పై, అధికారులపై, నన్నయవాణి లాంటి విశ్వవిద్యాలయ సమాచార సంచికపై నిరంతరం అపవాదాల్ని వేస్తూ అదే ఆహారంగా జీవిస్తున్న వ్యక్తుల వైఖరి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 'శ్రేయాంసి బహు విఘ్నాని' మంచి పనులకు ఆటంకాలు చాలా ఉంటాయని తెలుసు. NAAC గుర్తింపు పొంది విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి చెందాల్సిన సమయంలో ఇటువంటి వ్యక్తుల చేష్టలు గోదావరి జిల్లాల విద్యాభివృద్ధికి తీరని నష్టాన్ని కలిగిస్తాయి.

ఒక వ్యవస్థను అభివృద్ధి చేస్తూ నిలబెట్టడం చాలా కష్టం. నష్టాన్ని కలిగించడం చాలా సులువు. నష్టాన్ని కలిగించే వ్యక్తులు చరిత్రలో మిగలరు. అభివృద్ధికి అందరికంటే ముందు ఉండేలా జీవించటం ఎంతో శ్రేయస్కరం. నాటకీయమైన భావోద్రేకాలు అనారోగ్యం కూడా. మంచితనాన్ని ఎలుగెత్తి చాటాలి. సత్యమేవ జయతే! నిజమే జయిస్తుంది. సమర్థులు విద్యావేత్తలు ఇటువంటి చర్యల్ని ఖండించకపోతే ఆ చర్యలు మన ఎదురుగానే సమాజాన్ని నాశనం చేస్తాయి.

మంచిని అంగీకరించటం సానుకూలమైన భావన!
చెడును తిరస్కరించటం అభివృద్ధికి సూచన!!

– ఎడిటర్

తమకై అన్యహితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్, వృధాన్యార్థ భంగము కావించెడు వారలెవ్వరో ఎరుంగన్ శక్యమే!?"

తమ పనుల నిమిత్తం ఇతరులను చెడగొట్టు వారు మనుషులలో అధములు. తమకు నష్టం లేకపోయినా ఇతరులకు నష్టాన్ని కలిగించే వారికి ఏమని పేరు పెట్టాలో తెలియటం లేదు.

– భర్తృహరి సుభాషితం

## సంపాదకీయం




## మదింపు - గుర్తింపు

NAAC - జాతీయ మదింపు మరియు గుర్తింపు సంస్థ.దీని ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా విశ్వవిద్యాలయాలకు,కళాశాలలకు నిధులు సమకూరుస్తున్న స్వయం ప్రతిపత్తి సంస్థ.1994 లో భారత ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది.

ఒక వ్యవస్థ నిర్దిష్ట హోదా కలిగి ఉన్నట్లు లేదా ఒక నిర్దిష్ట కార్యాచరణను నిర్వహించడానికి అర్హత ఉన్నట్లు అధికారికంగా గుర్తించే చర్యనే NAAC నిర్వహిస్తోంది. నిర్దేశించిన ప్రమాణాలకు అనుకూలంగా, అనుగుణంగా ఉందని అధికారిక ధ్రువీకరణను ఇస్తుంది. మరింత మెరుగ్గా వ్యవస్థను నిర్మాణం చేసుకోవడానికి స్వీయ మార్గదర్శకాలను కలిగి ఉండటానికి విద్యావ్యవస్థలో విశ్వవిద్యాలయాలకు, కళాశాలలకు న్యాక్ గుర్తింపు అవసరమవుతుంది.

విద్యా వ్యవస్థలో ఒక విశ్వవిద్యాలయంలో,కళాశాలలో వ్యవస్థ ఇలా ఉండాలి, ఉంటేనే విద్యార్థులకు మెరుగైన విద్యను సౌకర్యాలను అందించగలుగుతామని ప్రమాణాల్ని సూచిస్తుంది. దేశవ్యాప్తంగా మెరుగైన విద్యా విధానాన్ని,ప్రమాణాలను అందించగలిగితే మెరుగైన సమాజం, సమర్థవంతమైన పౌరుల నిర్మాణానికి అది దోహదం చేస్తుంది. దేశాభివృద్ధిలో విద్యా విధానం ఒక ముఖ్యమైన అంగం. అది పటిష్టంగా ఉండటం కోసమే జాతీయ విద్యా విధానాల రూపకల్పన, విద్యా వ్యవస్థలను మదింపు చేయటం, వాటికి గుర్తింపును అందించటం, విలువైన ప్రమాణాలను కొనసాగించాలని ఆశించడమే న్యాక్ ఉద్దేశం.

సమర్థవంతమైన బోధన, పరిశోధనలు,సౌకర్యాల కల్పన, సృజనాత్మక కార్యక్రమాలు, నైపుణ్యాల మెరుగుదలకు శిక్షణ, విలువైన సమాచారాన్ని అందించటం, అభ్యాసాలు,క్షేత్ర పర్యటనలు,కార్యశాలలు, విద్యార్థుల సామర్థ్యాలను నింపే కార్యక్రమాల నిర్వహణ, స్వీయ అభ్యసనం, విద్యార్థి అభ్యసనాంశాల గురించిన విలువైన సమాచారాన్ని అందించే గ్రంథాలతో గ్రంథాలయ సేవలు, ఉపాధి ఉద్యోగ అవకాశాలపై శిక్షణ, ఉత్సాహభరితమైన వాతావరణన్నింపటానికి క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు... వంటివి ప్రతి విద్యాలయం సంపూర్ణంగా అందించే ప్రయత్నం చేయాలనేదే న్యాక్ ఆశయం.ఈ విషయాలను సంపూర్ణంగా సమర్థవంతంగా ఆచరణలోకి తీసుకురావలసిన బాధ్యత ఆ వ్యవస్థలకుంది కూడా.

నాణ్యమైన విద్య, అభ్యసనం, అభ్యాసం,శిక్షణ పొందుతూ సామర్థ్యాల్ని క్రమ పద్ధతిలో పొందుతూ అత్యుత్తమమైనదిగా వ్యవస్థలు నిర్మాణం కావటానికే NAAC గుర్తింపు అవసరం.

నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఈ వారంలో మూడు రోజుల పాటు నాక్ పీర్ టీమ్ సందర్శిస్తున్న సందర్భంలో నన్నయవాణి వారికి ఆహ్వానాన్ని పలుకుతూ అభివాదాల్ని అందిస్తోంది.విజయోస్తు!

# కొత్త శకానికి నాంది

### ఉపకులపతి సందేశం -

**విశ్వ విద్యాలయ సిబ్బందికి నమస్సులు !!**

నన్నయ విశ్వవిద్యాలయం NAAC పీర్ టీమ్ సందర్శన కోసం సిద్ధమవుతున్న తరుణం.ఇది మన అత్యంత బాధ్యత. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సభ్యులుగా మనం మన విభాగాల ప్రదర్శనను సంస్థ దాని ఉత్తమ మరియు ప్రకాశవంతమైన పద్ధతిలో అందిస్తున్నాం. ఇది ఈ విశ్వవిద్యాలయానికి దిశానిర్దేశం చేయగల గొప్ప మార్గం,
ఒక గొప్ప పరివర్తన వైపు ప్రయాణం.



NAAC అక్రిడిటేషన్ అనేది ఒక విద్యావ్యవస్థకు అందించబడే అత్యున్నత గౌరవాలలో ఒకటి. NAAC పీర్ టీమ్‌లో ఉన్నతమైన అంతర్దృష్టులు మరియు విద్యావేత్తలు ఉంటారు. వారి పరిశీలనకు ఆయా విభాగాల యొక్క ముఖ్యాంశాలను జాగ్రత్తగా సిద్ధం చేసిన ప్రదర్శనలు
యూనివర్శిటీకి మంచి గ్రేడ్ ను తీసుకువస్తాయి.

యూనివర్శిటీ అధిపతిగా నేను మీపై నమ్మకం ఉంచాను. అలుపెరుగని శక్తితో ప్రయాణించి ఇటీవలి కాలంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం. COVID మహమ్మారి సమయంలో సమష్టి భావాల్ని కలిగి ఉన్నాం. విద్యావేత్తలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు విజయవంతంగా నిమగ్నమయ్యారు. మన అలుపెరగని ఉత్సాహం, అంకితభావం 100కి పైగా వెబ్‌నార్లు, ఎఫ్.డి.పిలు మరియు సెమినార్‌లను నిర్వహించడంలో మనకు సహాయపడింది - ఇవి మనకు ఉన్నత స్థానం సంపాదించి పెట్టాయి. ASIA బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది.

పీర్ టీమ్ విజిట్‌లో కూడా అదే శక్తి మరియు ఉత్సాహం చూపబడతాయని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. ఐక్యత మన బలమని నమ్ముతున్నాను. ఈ సమయంలో మన ఐక్యత మరింత మెరుగ్గా ఉండటం కీలకమని విశ్వసిస్తున్నాను.

మన విశ్వవిద్యాలయం, మన విద్యార్థుల భవిష్యత్తు, ఒక జట్టుగా మనలో ఉన్న ఐక్యత మరియు పట్టుదల ఈ సంస్థ కోసం మన దృక్పథాన్ని నిజం చేయాలి.

యూనివర్శిటీ అభివృద్ధిలో మీలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించారు. ISO లేదా AICTE ల కోసం మూడు సంవత్సరాల వ్యవధిలో, మీరు గొప్ప సంకల్పాన్ని ప్రదర్శించారు. సంస్థ యొక్క అభివృద్ధి కోసం నేనుకూడా అదే అంకితభావం మరియు నిబద్ధత కోసం ఎదురు చూస్తున్నాను.

సామూహిక టీమ్ వర్క్ మరియు కృషితో యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వస్తుందని నేను ఆశాభావంతో ఉన్నాను. ఇది విశ్వవిద్యాలయాన్ని కొత్త దశలోకి తీసుకువెళు తుంది. అందరి సమష్టి కృషి కోసం ఎదురు చూస్తున్నాను.

విశ్వవిద్యాలయానికి నిరంతర విజయాలు చేకూరాలని ఆశిస్తున్నాను.

**- ఆచార్య మొక్కా జగన్నాథరావు**

# నన్నయ వీసీని కలిసిన ఎన్.సి.సి సుబేదార్ మేజర్

**10.11.22 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఎన్.సి.సి గ్రూప్ హెడ్ క్వార్టర్ కాకినాడ సుబేదర్ మేజర్ జి.గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిసారు. విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో వీసీని కలిసిన సుబేదార్ మేజర్ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిపై ఆనందాన్ని వ్యక్తం చేసారు. వీసీ జగన్నాథరావు నాయకత్వంలో విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధిని సాధించిందని అభినందించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్ మరియు పూర్వ విద్యార్థుల సదస్సును నిర్వహించుకొనేందుకు నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో అనుమతిని అవ్వాల్సిందిగా కోరారు. దేశంలోనే అతిపెద్ద ఎన్.సి.సి గ్రూప్ అయిన తూర్పు గోదావరి , పశ్చిమ గోదావరి మరియు కృష్ణా జిల్లాలన్నింటిలో ఇరవై వేలకు పైగా క్యాడెట్‌లను కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సుకు దాదాపు 500 మంది అతిథులను ఆహ్వానిస్తున్నామని పెద్ద ఎత్తున చేసే కార్యక్రమానికి విశ్వవిద్యాలయ సహకారాన్ని




గోవిందరావుకు విశ్వవిద్యాలయ జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

అందించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో 20వ తేదిన ఎన్.సి.సి ఆఫీసర్ మరియు పూర్వ విద్యార్థుల సదస్సును ఏర్పాటు చేసుకునేందుకు అనుమతినిచ్చారు. అలాగే రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు, పెద్ద ఎత్తున ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు కలిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్.సి.సి విభాగాన్ని ఏర్పాటు చేయడానికి మార్గనిర్ధేశం చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలో ఫుల్లీ ఫైనాన్స్ సెల్ఫ్ స్కిల్ ఎన్.సి.సి. విభాగాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్.సి.సి విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానని గోవిందరావు తెలియజేసారు. అనంతరం గోవిందరావుకు విశ్వవిద్యాలయ జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఎన్.సి.సి అధికారులు పాల్గొన్నారు.

# పండిట్ జవహర్ లాల్ నెహ్రూ

**(నవంబర్ 14, 1889 - మే 27, 1964)**




## ప్రతిభా వాణి

భారతదేశ తొలి ప్రధాని, భారత స్వాతంత్ర్య పోరాట నాయకుడు. పండిత్‌జీ గా ప్రాచుర్యం పొందిన ఈయన రచయిత, పండితుడు, చరిత్రకారుడు కూడా. భారత రాజకీయలలో శక్తివంతమైన నెహ్రూ–గాంధీ కుటుంబానికి ఈయనే మూలపురుషుడు. భారతదేశానికి ప్రప్రథమ ప్రధానిగా పని చేసిన జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని బ్రిటీష్ కబంధహస్తాల నుంచి విడిపించేలా కీలక పాత్ర పోషించారు. మహాత్మ గాంధీతో ఏర్పడిన పరిచయం ఆయనను దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోకి దిగేలా చూసింది. తన తిరుగుబాటు చర్యలతో ఆయన జైలు పాలు కావాల్సి వచ్చింది. ఉద్యమకాలంలో బ్రిటీష్ వారు ఆయనను జైలు పాలు చేసినా, నిర్బంధాలకు గురి చేసినా నిరాశ చెందక, దేశ వ్యాప్తంగా ర్యాలీలు చేపట్టి 1947 లో తెల్లవారి పాలన అంతమయ్యేలా కృషి సల్పారు. దేశ స్వాతంత్ర్యానంతరం 1947 లో ప్రధానిగా ఎన్నికయి, 1964 లో మరణించేంత వరకూ ఆ పదవిలో కొనసాగారు. డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆయన విశేషమైన రచన.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆయన తొమ్మిదిసార్లు జైలు పాలయ్యారు. దేశానికి మూడో ప్రధానిగా పని చేసిన ఇందిరాగాంధీ, ఆయన కుమార్తె.

నెహ్రూజీకి గులాబీలు అన్నా గులాబీ లాంటి పిల్లలన్నా చాలా ఇష్టం. అందువల్లే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటూ ఉంటాం.

# నన్నయ వీసీని మర్యాదపూర్వకంగా కలిగిన గైట్ ప్రిన్సిపాల్

**08.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును గైట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.వల్లిమాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రశంసిస్తూ గైట్ కళాశాలలో ఇటీవల జరిగిన కార్యక్రమాలను ప్రగతిని తెలియజేసారు. అలాగే భారతీయ తత్వవేత్త జాతీయవాది యోగి మహర్షి కవి శ్రీ అరబిందో ఔనత్యాన్ని అందరికీ తెలియజేసే విధంగా విశ్వవిద్యాలయంలో సెమినార్ నిర్వహించాలని కోరారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల శ్రీ అరబిందో ప్రశంసిస్తూ ప్రసంగించిన ఉపన్యాసాలు, దేశవ్యాప్తంగా ఆయా విద్యా సంస్థల్లో జరుగుతున్న సెమినార్లకు ఎంతోమంది స్ఫూర్తిని పొందుతున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో త్వరలో శ్రీ అరబిందో విజ్ఞాన వికాసాలపై సెమినార్ నిర్వహించవచ్చునని తెలియజేశారు. భారతీయ తత్వశాస్త్రము ప్రాచీన సంస్కృతి ఔనత్యాలు నేటి తరానికి ఎంతో అవసరమని అన్నారు. తరువాత "ది హ్యూమన్ సైకిల్ ది ఐడియల్ ఆఫ్ హ్యూమన్ యూనిటీ వార్ అండ్ సెల్ఫ్ డిటర్మినేషన్" శ్రీ అరబిందో పుస్తకాన్ని వీసీకి బహుకరించారు. ఈ కార్యక్రమంలో గైట్ కాలేజ్ అధ్యాపకులు సోమశేఖరరాజు, ఎం. సావిత్రి, లక్ష్మీ జ్యోతిలు పాల్గొన్నారు.



విసికి శ్రీఅరబిందో పుస్తకాన్ని బహుకరిస్తున్న ప్రిన్సిపాల్.

# వాటర్ డిస్పెన్సర్‌లను బహూకరించిన డా.కె.సుబ్బారావు




వాటర్ డిస్పెన్సర్ లను ప్రారంభించిన వీసీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణ కళాశాలలకు ప్రధాన విభాగాలకు ఏడు వాటర్ డిస్పెన్సర్ లను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు బహూకరించారు. ఆదివారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావును అభినందించారు. సుమారు రూ.75 వేలతో ఏడు వాటర్ డిస్పెన్సర్ లను బహుకరించారని అన్నారు. మినీ ఫ్రిజ్ తో కూడిన వేడి మరియు చల్లటి నీటిని అందించే వాటర్ డిస్పెన్సర్ లను ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలలకు మరియు మూడు ప్రధాన పరిపాలన కార్యాలయాలకు అందించారని చెప్పారు. విద్యార్థులకు చక్కని తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో వీటిని సహృదయంతో బహుకరించిన డా.కె.సుబ్బారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# పోస్ట్ చేయని ఉత్తరం

## పుస్తకం






నన్ను మీ జీవితంలో చేర్చుకోండి. నేను జీవితాంతం మీకు తోడుంటాను అంటున్న పుస్తకం పోస్ట్ చేయని ఉత్తరం.

జీవితానికి సంబంధించిన వివేకాన్ని ఈ పుస్తకం ఎంతో సరళంగా, మరింత సమర్థంగా మన ముందుంచుతుంది ఈ పుస్తకం. ఒక తెలివైన మాటని చదవటంతో రోజువారి సీనియర్ మేనేజ్మెంట్ సమావేశాన్ని ప్రారంభిస్తుంటాం. దానివల్ల మనం జీవితాన్ని చూసే విధానంలో గొప్ప మార్పు కలుగుతుంది. అంతర్దృష్టికి సంబంధించిన చిన్న చిన్న శక్తివంతమైన వాక్యాలు మనకు కావలసిన స్పష్టతని అద్భుతంగా అందిస్తాయి.

మానవ ప్రయత్నానికి సంబంధించిన ఏ రంగంలోనైనా అది ఆధ్యాత్మికమైనదైనా, భావాత్మకమైనదైనా, భౌతికమైనదైనా అత్యధికంగా కాంక్షించేవారికైనా అవ్యక్తంగా ఉన్న అనంతమైన విరాట్ శక్తిని మానవ చైతన్యం విశ్వసించేలా మార్పు తీసుకొచ్చి అడ్డంకులని అధిగమించటానికి దారి చూపుతుంది ఈ పుస్తకంలోని ఇన్ఫినిథీయిజమ్.

ఈ పుస్తకంలోని పేజీల్లో పాఠకులకు అనేక పరిష్కారాలు దొరుకుతాయి. అవి మానవీయ చైతన్యానికున్న అనంతమైన విరాట్ శక్తిని అర్థం చేసుకునేందుకు దోహదం చేస్తాయి. ఆధ్యాత్మిక, భావాత్మక, భౌతిక రంగాలలో వేటిలోనైనా సమృద్ధిని కాంక్షించటానికి ప్రయత్నిస్తున్న వారి కోసమే ఈ పుస్తకం. అత్యధికంగా మరింత గొప్పగా జీవించే పురోగతిని పాఠకులు ఈ పుస్తకం ద్వారా సాధిస్తారని ఆశించారు రచయిత మహాత్రయా రా.

ఆర్.శాంత సుందరి తెలుగులో అనువాదం చేసిన ఈ గ్రంథాన్ని మంజుల్ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. ఐన్స్టీన్ తన జీవితాన్నంతా ధారబోసి ఈ ప్రపంచానికి కొన్ని సిద్ధాంతాలని అందించారు. అప్పటినుంచి ఈ ప్రపంచం అంతకు ముందు ఉన్నట్టు లేదు. ఎడిసన్ జీవితం ప్రపంచంలోని మనుషుల జీవన విధానాన్ని మార్చేసింది. గాంధీ, మండేలా ఒక కొత్త సంస్కృతికి జన్మనిచ్చారు. మిల్టన్, టాగూర్ కవిత్వానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. రోజర్ బానిస్టర్, ఎడ్మండ్ హిల్లరీ మానవ సామర్థ్యానికి కొత్త నిర్వచనాన్నిచ్చారు. సోక్రటీస్, అరి స్టాటిల్, ప్లాటో ప్రపంచం ఆలోచించే విధానాన్ని మార్చేశారు. మన ముందు తరాలు మానవ చైతన్య వికాసానికి తమవంతు పాత్ర నిర్వహించినట్లు చరిత్రలో అక్షరబద్ధమై ఉంది.

దాని తాలూకు ఫలితాలను మనం అనుభవిస్తున్నాం కూడా. అలాగే పాఠకుల జీవితాలలో ఏదైనా మార్పు తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తక రచన అంటారు రచయిత మహాత్రయ. తప్పనిసరిగా, శ్రద్ధగా చదవాల్సిన పుస్తకాలలో ఇదొకటి. కొద్ది రోజులు మన చేతులు దీనిని ధరిస్తూ, కొన్ని విషయాలను మస్తిష్కం స్వీకరిస్తే మన ఆలోచనలు, ఆచరణలు చాలా ఉత్కృష్టంగా ఉంటాయన్నది నా అభిప్రాయం.

**సమీక్ష: టి. శ్రీసాహితి**
**పూర్వ విద్యార్థి, సైకాలజీ విభాగం, అనూర్**

## నన్నయలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి



మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న అధికారులు

**11.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అబుల్ కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విశేష సేవలందించారని కొనియాడారు. భారతదేశ విద్యావ్యవస్థకు పునాదులు వేసిన ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. మౌలానా ఆజాద్ మతాలకు అతీతంగా పని చేసారని అన్నారు. స్వదేశీ ఉద్యమం, రౌలత్ చట్టం, ఉప్పుసత్యాగ్రహం వంటి ఉద్యమాలలో గాంధీజీ వెన్నంటే ఉండేవారని తెలిపారు. అబుల్ కలామ్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, డా.కె.వి.స్వామి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.ఎం.గోపాలకృష్ణ, డా.దమయంతి, సిఈ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోల్ సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించిన వీసీ



**12.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాల సమాచారాన్ని ఆన్లైన్ ద్వారా తెలుసుకునేందుకు సోల్ సాఫ్ట్వేర్ ఫర్ యూనివర్సిటీ లైబ్రరీస్ అనే గ్రంథాలయ సాఫ్ట్వేర్ ను ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సాఫ్ట్వేర్ ద్వారా గ్రంథాలయంలో పుస్తకాల వివరాలు మరియు విద్యార్ధులకు తీసుకోవడానికి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలు తెలుసు కోవడానికి ఈ సాఫ్ట్వేర్ ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్ధులు అధ్యాపకులు తమకు కావలసిన పుస్తకాలను ఆన్లైన్ ద్వారా రిజర్వు చేసుకొనే సౌలభ్యం కుడా ఈ సాఫ్ట్వేర్ లో ఉందని తెలియజేసారు. ఆన్లైన్ ద్వారా సలహాలు సూచనలు ఇచ్చె అవకాశం కుడా ఈ సాఫ్ట్వేర్ లో ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, గ్రంథాలయ కోఆర్డినేటర్ డా.రమణేశ్వరి , ఓ.ఎస్.డి ఆచార్య ఎస్. టికి , డీన్ ఆచార్య సురేష్ వర్మ , ప్రిన్సిపాల్ డా.సుబ్బారావు రావు , IQAC డైరెక్టర్ డా.కె.వి. స్వామి , సహాయ గ్రంథపాలకులు డా.టి.సింహాచలం మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం


## ప్లీజ్.. కొంత సమయం...

సమయం,సంభాషణ,స్పర్శ, నమ్మకం..ఇవే.. ఈ నాలుగు పదాల ఆచరణవల్లే మీ పిల్లలు మిమ్మల్ని ప్రేమిస్తారు. మీరు మీ పిల్లలకు సమయం కేటాయించకపోతే వాళ్ళు వేరే వాళ్లకు సమయం కేటాయిస్తారు. మీరుమాట్లాడకపోతే మాట్లాడే వాళ్లను వెతుక్కుంటారు. మీ స్పర్శను కోల్పోతే కొత్త స్పర్శను కోరుకుంటారు. మీ నమ్మకాన్ని కోల్పోతే పరాయి వాళ్ళను నమ్ముతారు. మీరు ప్రేమించకపోతే వేరే వాళ్ల దగ్గర ఆ ప్రేమను పొందుతారు.ఇవన్నీ నిజాలు.నిజాలు ఎప్పుడు చేదుగానే ఉంటాయి. బాధగా కూడా ఉంటాయి. కాసేపు పిల్లలతో గడపండి.మాట్లాడండి.పిల్లల దగ్గర సంభాషణలో మీ మాటల్లో టీవీలోని వినోదం ఉండాలి. వారితో మీ సంభాషణ సోషల్ మీడియాలోని హుషారు కనిపించాలి. మీ పలకరింపులో స్నేహం,మాధుర్యం,ఆప్యాయత మీ కబుర్లలో విజ్ఞానం ఉంటే అటువంటి తల్లిదండ్రులు పిల్లల గురించి భయపడాల్సిన పనిలేదు.

ఇంటి నిండా సౌకర్యాలున్నా, కోరినవన్నీ కొనుక్కునే స్వేచ్ఛ ఉన్నా, తనతో అమ్మానాన్నలు సమయం గడపలేని, నోరారా మాట్లాడలేని పరిస్థితులే పిల్లల్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్న అంశాలు.ఓ సుదీర్ఘమైన ఫోన్ కాల్ కు కేటాయించిన సమయాన్ని పిల్లల కోసం పక్కన తీసి పెట్టకపోతే మన ఒంట్లో నుంచి ఇంట్లోకి ఎందుకు వాళ్లు పుట్టారో వాళ్ళకే అర్థం కాదు. ఎదిగే క్రమంలోని ఆలోచనల్లో, వ్యక్తిత్వంలో చిన్న చిన్న తేడాలు సరిదిద్దటానికి ఇష్టాయిష్టాల అభిరుచులు అర్థంకావటానికి మాటలవల్లే పిల్లలతో దగ్గరితనం పెరుగుతుంది. నిజాయితీగా మాట్లాడితే పిల్లలు నిజాయితీపరులు అవుతారు. ఎదుటి మనిషి మీద ప్రేమ, సమాజం మీద గౌరవం, విలువల పట్ల విశ్వాసం... ఇవి కచ్చితంగా తల్లిదండ్రుల నుంచి సంక్రమించేవే.

మీరు సమయాన్ని కేటాయించి చూడండి.పిల్లల మనసుల్లోని భావాల్ని,ఆలోచనల్ని, భయాల్ని ,బాధల్ని పంచుకోవటానికి సాక్షాత్తు తల్లిదండ్రులే సిద్ధంగా ఉంటే ముక్కు మొహం తెలియని ఫేస్బుక్ ఫ్రెండ్స్ తో వాళ్లకు పనేంటి?

కుటుంబంతో గడపలేని,వెనక్కి తిరిగి చూడలేనంత పరుగులో, వేగంలో,హోదాల్లో, సంపాదనలో మీరు ఉంటే కనుక, పిల్లలు మిమ్మల్ని చేరుకోలేక అలా దూరంగా నిలబడి చూస్తారంతే!... ఇంక అంతే!!



## ప్రశ్న?

అడవుల్లో గనులున్నాయని ఎందుకీ వెలికితీత?
కనిపించిన ప్రతి కొండనూ తవ్వేంత తప్పేమి చేసింది మన భూమాత?
అడవులను నరికితే లాభమెంత?
అడవులను నరికిన తరువాత
కాలుష్యం పెరుగుతోంది మన చెంత.
జీవజాలానికి కలుగుతోంది అన్నింటా కొరత.
ఇకనైనా చైతన్యం రావాలి  మనలో ఎంతైనా కొంత.
కలిసికట్టుగా జీవరాశులను కాపాడాలి వీలైనంత.
దీనిపై ఆలోచించాలి తక్షణమే ప్రతి ప్రభుత్వ నేత.
ప్రకృతిపై చూపాలి తప్పక మీ విధేయత.
అడవుల్లో మైనింగ్ ను  చెయ్యాలి నిలిపివేత.
అని అడుగుతోంది నేటి భారత యువత?!!

- మోసిగంటి రాజేష్
బి.టెక్ సివిల్, అనూర్



నన్నయ వీసీ ని మర్యాద పూర్వకంగా కలిసిన సినీ రచయిత,దర్శకులు డా.మహేంద్ర చక్రవర్తి